
తాటితూరు మార్గంలో శిథిలమైన , రక్షణగోడ లేని పాత వంతెన


మహరాజుపేట-పద్మనాభం రహదారి నుంచి తాటితూరు వెళ్లే మార్గం ఇలా..


ఇటీవల భారీ వర్షాలకు తాటితూరు అంజనేయ స్వామి జంక్షన్ వద్ద కోతకు గురైన రోడ్డు

ప్రయాణం.. ప్రహసనం

- తాటితూరు చుట్టూ రహదారి సమస్యలు
- అధ్వానంగా బీటీ రోడ్డు
- శిథిలమైన కల్వర్టులు
- రాకపోకలకు అవస్థలు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు వెళ్లాలంటే పంచాయతీవాసులకు, పరిసర గ్రామాల వారికి ప్రయాణమే ప్రహసనంగా మారుతున్న పరిస్థితి. ఊరికి వెళ్లే రహదారులు సరిగ్గా లేకపోవడంతో వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ చుట్టూ గోస్తని నది, పంట కాలువల కారణంగా వర్షాలకు తరచూ నీరు చుట్టు ముడుతోంది. నదిని దాటేందుకు వంతెనలు లేకపోయినా, పంట కాలువలను దాటడానికి ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టులు ఎక్కడికక్కడ శిథిలమై కుంగిపోవడంతో పంచాయతీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటుకలతో నిర్మించిన ఈ కల్వర్టుల స్థానంలో కాంక్రీట్ కల్వర్టులు నిర్మించి ప్రమాదకరమైన మలుపులతో కూడిన బీటీ రోడ్డును ఆధునీకరించాలని కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు

మహరాజుపేట–పద్మనాభం రహదారిని ఆనుకుని ఉన్న తాటితూరు ఆంజనేయస్వామి కూడలి నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఈ బీటీరోడ్డు సరిగా లేకపోవడంతో, ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు సరిగ్గా లేక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాటితూరుకు వెళ్లే సిటీబస్సును సైతం చాలా ఏళ్లుగా నిలిపివేశారు. వర్షాలకు అంజనేయస్వామి కూడలి వద్ద రోడ్డు తరచూ కోతకు గురవుతున్నందున పంచాయతీయే రూ.10 వేలు వంతున ఖర్చు చేసి దీనిని సరిచేయవలసి వస్తోంది. ఇటీవల కోతకు గురైన ఈ కూడలిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించి హామీ


సంగివలస-పాండ్రంగి రహదారిలో గోస్తని గెడ్డపై కుంగిపోయిన మార్గం

ఇచ్చినా, ఆర్ అండ్ బీ నుంచి పునరుద్ధరణ పనులు ఇప్పటికీ జరగలేదు.

పంచాయతీ మధ్య నుంచి 'గోస్తని'

ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా పంచాయతీ మధ్యలో నుంచి గోస్తనినది పరవళ్లు తొక్కుతోంది. జెడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని నది ప్రవహిస్తోంది. పంచాయతీలో చాలామంది రైతులు, కూలీలు, విద్యార్థులు, ఇటుక బట్టీల యజమానులు ప్రతిరోజూ నదిని దాటుకుని వెళ్తే తప్ప వారికి పూట గడవదు. నదిపై పంచాయతీవాసులు ఐక్యంగా తాటిదుంగలు, మట్టి, చెక్కలతో తాత్కాలికంగా నిర్మించుకునే వంతెనలు వరదలు వచ్చిన ప్రతీసారి కొట్టుకుని వెళ్లిపోతున్నాయి. లేదంటే చిల్లవాని చెరువు గట్టును ఆనుకుని కాగితాలపేట, మజ్జివలస మీదుగా చుట్టూ తిరిగి పంచాయతీ నుంచి బయట పడవలసి వస్తోంది.

నిలిచిన కాజ్‌వే నిర్మాణం

టి.నగరపాలెం మీదుగా రాకపోకలు సాగించే అవకాశం ఉన్నా ఇటువైపు కూడా గోస్తని నది వలన అప్పుడప్పుడు ఆటంకాలు ఏర్పడుతుంటాయి. గత


ఉండబట్ల వారి కళ్లాల వద్ద ప్రమాదకరమైన మలుపు, మార్గం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గోస్తని నదిపై రూ.2 కోట్లతో కాజ్‌వే నిర్మాణానికి ముందుకు వచ్చినా కాంట్రాక్టర్ నిర్వాకం కారణంగా పనులు ఆగిపోయాయి. 4వేల పై చిలుకు జనాభా కలిగిన తాటితూరు నుంచి మహరాజుపేట వైపు ఉన్న పురాతన రహదారిని ఆధునికీకరించి వరదల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే నదిపై వంతెన, కాగితాలపేట వైపు రహదారులను పునరుద్ధరించి, ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించాలని కోరుతున్నారు.

అసలే ఇరుకు.. ఆపై శిథిలం



తాటితూరు ప్రధాన రహదారి ఇరుకుగా ఉంటుంది. భారీ వాహనాల రాకపోకల కారణంగా పలుచోట్ల పగుళ్లు ఉన్నాయి. దీనికితోడు పంట కాలువలపై నిర్మాణాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. చాలా సమస్యగా ఉంది.

– కామిరెడ్డి కృష్ణ, ఉండబట్లవారి కళ్లాలు, తాటితూరు

వర్షం వస్తే గుబులే..



గోస్తని నదికి ఎప్పుడు వరదలు వచ్చినా ముందుగా ఇబ్బంది పడేది మా పంచాయతీ వాసులే. నదీమార్గంతో పాటు పంటకాలువల ద్వారా వరదనీరు రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుంది. ఇప్పటికైనా పటిష్టమైన మార్గాలను నిర్మించాలి.

– రవ్వ ఈశ్వరరావు, ఎస్సీ కాలనీ, తాటితూరు

బస్సు సౌకర్యం పునరుద్ధరించాలి



గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాటితూరుకు బస్సు నడిచేది. స్థానికులు పువ్వులు, కూరగాయలు ఇక్కడి నుంచి నగరానికి తీసుకుపోయి విక్రయించుకునేవారు. తాటితూరులో బస్సు నైట్‌హాల్ట్ కూడా ఉండేది. ఆ బస్సును పునరుద్ధరించాలి

– కొయ్య మోహనరెడ్డి, కాగితాలపేట

క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట


స్వతంత్రనగర్‌లో రాట వేస్తున్న అర్చకులు, నిర్వాహకులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్ర నగర్ లక్ష్మీ దేవి అమ్మ వారి ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శుక్రవారం అంకురార్పణ చేశారు. ప్రధానార్చకులు పులఖండ గౌరీ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి బండియ్య పర్యవేక్షణలో కార్యదర్శి బాలు పాత్రో, శ్వేత, దాది గౌరిశంకర్, బేబి దంపతులు పూజలు చేసి రాట వేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని, 10వ తేది గురువారం అన్న సమారాధన ఉంటుందని చెప్పారు.

మధురవాడ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న చక్రపాణి

మధురవాడ: మధురవాడ సబ్ రిజిస్ట్రార్‌గా భీంపల్లి చక్రపాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.మోహనరావుకు పార్వతీపురం బదిలీ కావడంతో ఆయన స్థానంలో చక్రపాణి బాధ్యతలు చేపట్టారు. ఈయన ఐజీ ఆఫీసు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. చక్రపాణి మాట్లాడుతూ కక్షిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

కార్యాలయ సిబ్బంది బదిలీ

ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ సహా సీనియర్ అసిస్టెంట్ శేఖర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది అంతా వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు.

విద్యార్థినులకు స్టీల్‌ప్లేట్ల అందజేత

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు ఎంఎఫ్‌సీ అధినేతలు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ శుక్రవారం వంద స్టీల్ ప్లేట్లు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సెయింట్ పీటర్స్ చర్చి వద్ద శుక్రవారం ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. వన్ రియాలిటీ గ్రూప్స్ సీఈవో కులిడి సురేష్‌కుమార్ సహకారంతో అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఇందులో సాధారణ, స్త్రీ సమస్యలు, ఎముకలు, కంటి, దంత, చెవి, ముక్కు మొదలైన విభాగాల వైద్య నిపుణులు పాల్గొన్నారు. వైద్యులు 200 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాస్టర్ రెవరెండ్ చైతన్యకుమార్, విజయ్, సునీల్‌రావు, చార్లెస్, ప్రభుదాస్, సాగర్, సురేష్, లక్ష్మణ్, హరిబాబు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విభాగాలలో ఉపాధి అవకాశాలు

తగరపువలస: మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసించే వారి కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎదురు చూస్తున్నాయని ఆనందపురం మండలం కొంత్యాం ఎన్ఎస్ఆర్ఐటీ కార్యదర్శి ఎస్.ప్రసాదరాజు అన్నారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో వారికి అవకాశం ఉన్న వివిధ సంస్థల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంభుప్రసాద్, చీఫ్ మేనేజింగ్ అధికారి పి.ఎస్.రాజు, విభాగాధిపతి వి.బాల తదితరులు ప్రసంగించారు.

కొమ్మాది రోడ్డులోకి వారపు సంత

- స్థలాన్ని పరిశీలించిన పోలీసు, జీవీఎంసీ అధికారులు

మధురవాడ: మధురవాడ జోనల్ ఆఫీసు రోడ్డులో నిర్వహిస్తున్న శనివారం వారపు సంతను కొమ్మాది జంక్షన్ నుంచి కొమ్మాది వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డులోకి తరలిస్తున్నట్టు జీవీఎంసీ, పోలీసు అధికారులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఏడీసీపీ కె. ప్రవీణ్‌కుమార్, పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ ఎస్. కాంతారావు, ఎస్ఐలు విజయ్‌కుమార్, ప్రసాద్, జీవీఎంసీ జోన్–2 కమిషనర్ సింహాచలం, ఏసీపీ షబ్‌నాన్ శాస్త్రి తదితరులు సంత తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డు పక్కనున్న ఖాళీ ప్రదేశాలు, చేపట్టాల్సిన చర్యలపై ఇరు విభాగాల అధికారులు చర్చించారు.


స్థల పరిశీలన చేస్తున్న పోలీసు, జీవీఎంసీ అధికారులు

ప్రస్తుతం సంత నిర్వహిస్తున్న హైవే సర్వీసు రోడ్డులో జోనల్ ఆఫీసు, ఇతర ముఖ్యమైన సంస్థలు ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నందున సంత తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు, చిరు వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని, అందరూ సహకరించాలని కోరారు.

వైద్య కళాశాలల ఆచార్యులకు శిక్షణ

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో శుక్రవారం బేసిక్ కోర్సు ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ ప్రోగ్రాంను డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఫ్యాకల్టీ అంతా శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాలకు చెందిన జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏఎస్ వీరమణి మెడికల్ కమిషన్ పరిశీలకునిగా హాజరయ్యారు. మెడికల్ ఎడ్యుకేషన్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బెత్యూన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, పలువురు స్పెషాలిటీ


ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

ప్రొఫెసర్లు, ఏవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆరా

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద, మజ్జిపేట గ్రామ పంచాయతీలలో శుక్రవారం సునీల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్‌లతో కూడిన కేంద్ర బృందం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వ సాయంతో అమలవుతున్న పథకాలైన పెన్షన్లు, హౌసింగ్, పొదుపు సంఘాలు, గ్రామీణ ఉపాధి హామీ పథకాలు, ఉద్యానవన పంటలు, ప్రకృతి వ్యవసాయం గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలను మరింత మెరుగ్గా అమలు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు అడిగారు. లబ్ధిదారులకు బ్యాంకుల సహకారం గురించి అడిగి తెలుసుకున్నారు. బృందాలతో పాటు వ్యక్తిగతంగా కొన్ని ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులను విచారించారు.


డ్వాక్రా మహిళలతో సమావేశమైన కేంద్ర బృందం ప్రతినిధులు

వీరి వెంట భీమిలి ఎంపీడీవో ఎస్.హనుమంతరావు, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంఆర్‌డీసీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ డీఈఎం వైదేహి, పంచాయతీలు, సచివాలయాల సిబ్బంది, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

పద్మనాభం: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌ను పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మిందిలో అమర్‌నాథ్ గృహానికి వెళ్లి, ఆయనకు అభినందనలు తెలియజేశారు. దుశ్శాలువాతో సత్కరించారు.


అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న రాంబాబు, గిరిబాబు

డిజైర్ సొసైటీకి ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆర్థిక సాయం


నిర్వాహకులకు నగదు అందిస్తున్న ఎన్టీఆర్ యూత్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసకు చెందిన ఎన్టీఆర్ యూత్ అసోసియేషన్ గాజువాకలో ఉన్న డిజైర్ సొసైటీకి రూ.6300 అందించింది. సంస్థ నిర్వాహకుల ఫోన్ ద్వారా బాలల అవసరాలను తెలుసుకున్న అభిమానులు, అసోసియేషన్ ప్రతినిధి రౌతు చంటి ద్వారా శుక్రవారం సొసైటీకి సహకారం అందించారు.

గ్లోబల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలపై అవగాహన


గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్‌లో పాల్గొన్న ప్రతినిధులు, విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ నిర్వహించారు. ఇండియా, చైనా, ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికా, కెనడా, సింగపూర్, యూరప్‌లకు చెందిన 60కి పైగా ప్రఖ్యాత యూనివర్సిటీలు ఈ ఫెయిర్‌లో పాల్గొని 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయా యూనివర్సిటీల్లో కెరీర్, ప్రవేశం, స్కాలర్‌షిప్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇలాంటి ఫెయిర్ ద్వారా మెల్‌బోర్న్, ఎన్‌వైయూ, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీల్లో చాలామంది విద్యార్థులు ప్రవేశం పొందినట్టు ప్రిన్సిపాల్ బి. శైల తెలిపారు. స్కూల్ డైరెక్టర్ అమిత్‌జైన్ పాల్గొన్నారు.

రహదారి ఛిద్రం


బంగ్లామెట్ట శివాలయం వద్ద ఛిద్రమైన రహదారి

తగరపువలస: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ఒకటోవార్డు బంగ్లామెట్ట శివాలయం ఎదురుగా రహదారి ఛిద్రమైంది. మలుపుతో కూడిన ప్రాంతం కావడంతో ఈ గుంతలు ఏర్పడిన ప్రదేశంలో వాహనాలు కుదుపునకు గురవుతున్నాయి. చిన్న వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. వర్షం పెద్దదైతే ఈ రోడ్డు చెరువులా మారుతోంది. గుంతలు చిన్నవిగా ఉన్నప్పుడే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, బంగ్లామెట్ట ప్రజలు కోరుతున్నారు.

కూటమి నేతల తప్పుడు ప్రచారాలను తిప్పికొడదాం

- నేడు ఆలయాల్లో పూజలు చేద్దాం
- మాజీ మంత్రి ముత్తంశెట్టి పిలుపు


క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై కూటమి నేతలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రతి మండలంలోని ఆలయాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శ్రీవారిని పూజించాలని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపు ఇచ్చారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 28న ఏకాదశి, శనివారం నిర్వహిస్తున్న పూజల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆనందపురం మండల నాయకులు బోయపాలెం పైడా కళాశాల ఆవరణలోని శరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పద్మనాభం నాయకులు అనంత పద్మనాభస్వామి ఆలయంలో, భీమిలి మండల నాయకులు వెంకటేశ్వరమెట్టపై, మధురవాడ ప్రాంత నాయకులు రుషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కార్యక్రమాలకు హాజరు కావాలని తెలియజేశారు.

ఆక్రమిత స్థలం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 94లో గెడ్డ పోరంబోకు స్థలం, ఆ పక్కనే ఉన్న లే అవుట్ సర్వే నంబర్ 110లో ఉన్న జిరాయితీ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక టీడీపీ నాయకుడు రూ. 80లక్షలు విలువ చేసే 200గజాలు ప్రభుత్వ భూమిలో, ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తీసేసి మరీ నిర్మాణాలు చేపడుతున్న వైనంపై ×గెడ్డను మింగేస్తున్నారు× శీర్షికన సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. సర్వేయర్ శ్రీనుబాబు, రమణ, వీఆర్‌వో యువరాజు భూమిని పరిశీలించారు. ఇక్కడ నిర్మాణం చేస్తున్న వారు ఇది లే అవుట్‌లో ప్లాట్ నంబరు 95 హెచ్‌గా చూపిస్తున్నారు. అయితే మ్యాప్‌లో సదరు


ప్రభుత్వ హెచ్చరిక బోర్డు మాయం చేసిన ప్రాంతంలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

స్థలానికి నంబరు లేదు. దీనిపై వుడా అధికారులకు లెటర్ రాసి, ఈ స్థలం లే అవుట్‌లోనిదా లేక బైట స్థలమా.. లే అవుట్‌లోది అయితే అనుమతి పొందిన ప్లాటా లేక ఖాళీస్థలమా అన్నది నిర్ధారించాల్సి ఉందని సర్వేయర్ శ్రీనుబాబు చెప్పారు. అంతవరకు ఇక్కడ ఎటువంటి పనులు చేపట్టకూడదని స్పష్టం చేశారు.

అవయవ దానంతో మరణానంతర జీవనం

భీమునిపట్నం: అవయవ దానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి అన్నారు. ప్రతీ ఒక్కరు అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కీతిన్‌పేట సన్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన అవయవదాన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మనం మరణించిన తరువాత అవయవాలను దానం చేయడం ద్వారా వారి రూపంలో మనం జీవించి ఉంటామన్నారు. ఇటువంటి దానం ఎంతో గొప్పదని, దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. అవయవదానంపై అపోహలు తొలగించేందుకు తాము కొద్ది సంవత్సరాలుగా దీనిపై ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. నీడీ వెల్ఫేర్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ


అవయవదాన ఆవశ్యకతను తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

తమ అసోసియేషన్ ద్వారా రక్తదాన, కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని.. ఇప్పుడు తమ సభ్యులు అవయవదానానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. మరింత మంది ముందుకు రావడానికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో సావిత్రిబాయ్ పూలే ట్రస్ట్ సభ్యులు సురేఖ, కన్యాకుమారి, నీడీ వెల్ఫేర్ సభ్యులు ముసునూరి సూర్యశ్రీనివాస్, రాజేటి బసవ కృష్ణమూర్తి, కాళ్ల సన్నీ, సురేష్‌కుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యాలపై విద్యార్థులు దృష్టి సారించాలి

- జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ జయసుమ

తగరపువలస: విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు టెక్నికల్, సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ జి.జయసుమ అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. కంప్యూటర్ రంగంలో అధునాతన కోర్సులైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, ఐవోటీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీలలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని నూతన ఆవిష్కరణల దిశగా కృషి చేయాలన్నారు. ఎస్ఎస్‌టీఎల్ అడిషనల్ డైరెక్టర్


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ జయ సుమ, మాజీమంత్రి ముత్తంశెట్టి

జీవీ మనోజ్‌కుమార్, ఇన్‌స్పైర్డ్ ఐటీ సొల్యూషన్ వైస్ ప్రెసిడెంట్ బాసురు కృష్ణచైతన్య ప్రసంగించారు. అనంతరం కళాశాల మాసపత్రిక ప్రజ్ఞను విడుదల చేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముత్తంశెట్టి శివనందీష్, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, కన్వీనర్ జె.ఆర్.జి.పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ మేనేజర్ అదృశ్యం


శ్యామ్ (ఫైల్)

పీఎం పాలెం: కలెక్టర్ కార్యాలయంలో సెక్యూరిటీ మేనేజర్‌గా పని చేస్తున్న కోలా శ్యామ్ (49) అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. కొమ్మాది సేవానగర్‌లో నివసిస్తున్న శ్యామ్ రోజూలాగే ఈ నెల 21న ఉద్యోగ నిమిత్తం బయల్దేరి వెళ్లారు. రోజూ రాత్రి 9గంటలకు ఇంటికి తిరిగి వచ్చే ఆయన ఆ రోజు రాత్రి 10గంటలైనా రాలేదు. శ్యామ్ భార్య పద్మావతి చాలాసార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్‌లో ఉంది. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


నగరానికి ఈశాన్య ట్రైనీ పోలీసులు

విశాఖ సిటీ: నార్త్ ఈస్ట్ పోలీస్ అకాడమీ (నెపా) నుంచి 5 మంది ట్రైనీ డీఎస్పీలు, 10 మంది ట్రైనీ ఎస్సైలు అధ్యయన పర్యటన (భారత్ దర్శన్) నిమిత్తం విశాఖకు వచ్చారు. ఈ నెల 29వ తేదీ వరకు పోలీస్ విభాగానికి చెందిన పోలీస్ కంట్రోల్ రూమ్, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్, ఫింగర్ ప్రింగ్ బ్యూరోతో పాటు నగరంలో పలు అధ్యయన కేంద్రాలు, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించనున్నారు. శుక్రవారం వీరిని బీచ్ రోడ్డులో ఉన్న పోలీస్ ఆఫీసర్ మెస్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. వారితో సమావేశం నిర్వహించి పలు అనుభవాలను పంచుకున్నారు.

దళితుల భూములపై దళారుల కన్ను

- జీడిమామిడి మొక్కలు తొలగిస్తున్న కూటమి నేతలు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఎస్సీ కాలనీని ఆనుకుని సర్వే నంబర్ 248 కొండ ప్రాంతంలోని సుమారు 15 ఎకరాల్లో దళితేతరులు జీడిమామిడి తోటలను తొలగించి నీలగిరి మొక్కలు నాటుతున్నారు. ఉద్యోగులు బదిలీల్లో లీనమై ఉండగా కూటమి నాయకులు వారం రోజులుగా ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లో సుమారు 200 ఎకరాల వరకు కొండప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఉంది. ఇదే పంచాయతీకి చెందిన దళితులు జీడిమామిడి తోటలు సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఆశలు కల్పించిన కూటమి నాయకులు జీడితోటలు తొలగించి ప్రత్యామ్నాయంగా దళితేతరులచే నీలగిరి మొక్కలు నాటిస్తున్నారు. ఫలసాయంలో దళితులకు ఒక వాటా, మొక్కలు నాటిన దళితేతరులకు రెండు వాటాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం కళ్లు


కుసులవాడ కొండపై తొలగించిన జీడిమామిడి చెట్లు

కప్పి జరుగుతున్న ఈ తతంగంలో వాటాల తేడా కారణంగా విభేదాలు తలెత్తి కొందరు రచ్చకు తెరతీశారు. జీడితోటలు తొలగించి ప్రత్యామ్నాయంగా ఇతరులు నీలగిరి మొక్కలు నాటుతున్న విషయం దిగువస్థాయి అధికారులకు తెలిసినా చూసీచూడనట్టు వదిలేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకురాగా శనివారం తాను వెళ్లి పరిశీలిస్తానన్నారు. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.